

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - గురువారం

సాయంత్రం - 6:35

సహర్ - శుక్రవారం

ఉదయం - 4:46



జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య ఎదురవుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివారు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో జనాలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో సమస్య మరింత తీవ్రం కానుంది. ఇప్పటికే వ్యవసాయ బోరుబావుల వద్దకు పరుగులు పెడుతున్నారు. అయితే వ్యవసాయ బోర్లు, బావులను అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు

- ఎల్లూరులోని స్టోరేజీలో గణనీయంగా తగ్గుతున్న నీటిమట్టం
- తాగునీటి సమస్య ఎదురు కాకుండా ముందస్తు చర్యలు
- మిషన్ భగీరథతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి
- ముందస్తు చర్యలకు రూ.3.54 కోట్ల సీడీఎఫ్ నిధులు విడుదల

జలగండం?

వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతుండడంతో వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్లూరు సెగ్మెంట్ నుంచి మిషన్ భగీరథ ద్వారా వికారాబాద్ జిల్లాకు తాగునీటి సరఫరా కొనసాగుతోంది. రాఘవాపూర్ సమీపంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. జిల్లాకు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన తాగునీటి వనరులైన ఎల్లూరులోనూ నీటి మట్టం గణనీయంగా తగ్గుతుండగా, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా కిందకు పడిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ వేసవిలో తాగునీటి సమస్య ఎదురు కాకుండా ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. తాగునీటి సమస్య ఎదురు కాకుండా తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మిషన్ భగీరథ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

రోజూ 8,70,09 కిలో లీటర్ల తాగునీరు సరఫరా

జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు, 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 990 ఆవాసాలున్నాయి. మిషన్ భగీరథ ద్వారా 964 ఆవాసాలకు 871 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు 100ఎల్‌పీసీడీ, పట్టణ ప్రాంత ప్రజలకు 135 ఎల్‌పీసీడీ నీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. జిల్లాకు ప్రతిరోజూ 8,70,09కిలో లీటర్ల నీటి సరఫరా జరిగే విధంగా మిషన్ భగీరథ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పెరుగుతున్న ఎండలు, పెరగనున్న విద్యుత్ డిమాండ్ కారణంగా ఒత్తిడి పెరిగి పంపింగ్ మోటార్లు కాలిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పంపు సెట్ల మరమ్మతులు, బోరు బావుల్లో ఫ్లషింగ్ పనులు, పైపులైన్లు, చేతి పంపుల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టే విధంగా మిషన్ భగీరథ అధికారులు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న పవర్ పంపులు, సింగిల్ ఫేజ్ పంపు సెట్లు, చేతి పంపులను ఉపయోగించుకునేందుకు వీలుగా సంసిద్ధం చేస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా కలెక్టర్ నారాయణరెడ్డి ఇటీవల మిషన్ భగీరథ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

అప్పుడే తాగునీటి ఇబ్బందులు?

జిల్లాలో ప్రతి వేసవిలోనూ తాగునీటి సమస్య ఎదురవుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. శివారు ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఆ ప్రాంతాల ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో మిషన్ భగీరథ ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన నీటి వనరులో నీరు అడుగంటక ముందే తాగునీటి ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. మిషన్ భగీరథ కారణంగా వినియోగంలో లేని తాగునీటి సరఫరా పథకాలకు మరమ్మతులు చేపట్టి సిద్ధంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పంపుసెట్లు కాలిపోయినా నీటి సరఫరా నిలిచిపోకుండా కార్యాచరణ సిద్ధం చేశారు.

రూ.3.54 కోట్లు మంజూరు

జిల్లాలో తాగునీటి సమస్య ఎదురు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.54 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 776 పనులు చేపట్టాలని ప్రతిపాదించగా, ఇప్పటి వరకు ఆ పనుల్లో 140 పనులు పూర్తి చేశారు. తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రాథమికంగా అంచనా వేసిన ఆవాసాల్లో పంప్‌సెట్లు, పైపులైన్లు, చేతి పంపుల మరమ్మతులు, బోరు బావుల్లో ఫ్లషింగ్ పనులు చేపట్టే విధంగా ప్రణాళిక తయారు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైతే సమీపంలో ఉన్న వ్యవసాయ బోర్లు, బావులను అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు.

వినియోగించని శివసాగర్ నీరు

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో పాటు మునిసిపాలిటీల్లోనూ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. వికారాబాద్ పట్టణంలో మిషన్ భగీరథ కంటే ముందు మంజీరా, శివసాగర్ ద్వారా తాగునీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా కొనసాగడంతో శివసాగర్ నీరు వినియోగించడం లేదు. వేసవిలో తాగునీటి ఇక్కట్లు ఎదురు కాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా అవసరమైతే శివసాగర్ నుంచి తాగునీటి సరఫరా చేసే విధంగా పంప్‌హౌస్, ఫిల్టర్‌బెడ్ సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. కాగ్నా నుంచి తాండూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు నీటిని సరఫరా చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్ : వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాలలో బోర్లు అందుబాటులో ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మిషన్‌భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మంజూరైన పనులన్నింటినీ పూర్తి చేయాలని, పనిచేయని బోర్లు, చేతి పంపులు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలున్న గ్రామాలను గుర్తించి సత్వరమే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీపీవో జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు బాబుశ్రీనివాస్, నాగేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య ఎదురవకుండా చర్యలు



జిల్లాలో తాగునీటి సమస్య ఎదురు కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. పంపుసెట్లు, పైపులైన్లలో మరమ్మతులు ఏర్పడితే 24 గంటల్లోగా సరి చేయించి నీటి సరఫరా జరిగేలా చూస్తాం. అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- బాబుశ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, వికారాబాద్



పారదర్శకంగా ర్యాండమైజేషన్

- మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటిదశ ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల అధికారి , కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఐదు నియోజకవర్గాల్లో గల 2425 పోలింగ్ కేంద్రాలకుగాను ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరిగిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో 591 పోలింగ్‌కేంద్రాలకు 738కంట్రోల్ యూనిట్లు, 738 బ్యాలెట్ యూనిట్లు, 827వీవీప్యాట్‌లు కేటాయించగా, మల్కాజిగిరి నియోజకవర్గానికి 418 పోలింగ్ కేంద్రాలకు 522 కంట్రోల్ యూనిట్‌లు, 522 బ్యాలెట్‌యూనిట్లు, 585 వీవీ ప్యాట్‌లను, కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 417 పోలింగ్ కేంద్రాలకు 521 కంట్రోల్ యూనిట్లు, 521 బ్యాలెట్ యూనిట్లు, 583 వీవీ ప్యాట్‌లు, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో 592 పోలింగ్ కేంద్రాలకు 740 కంట్రోల్ యూనిట్లు , 740 బ్యాలెట్ యూనిట్లు, 828 వీవీ ప్యాట్‌లు, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో 407 పోలింగ్ కేంద్రాలకు 508 కంట్రోల్ యూనిట్లు, 506 బ్యాలెట్ యూనిట్లు, 569వీవీ ప్యాట్‌లు, మొత్తం 3028 సీయులు, 3029 బీయులు, 3393వీవీ ప్యాట్‌లు కేటాయించడం జరిగిందన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌కు సంబంధించిన హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరిండెంట్ రాజేశ్వర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం బయటకు రావొద్దు

ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్న సమయాల్లో ప్రజలు బయటకు రావద్దని కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఎండల్లో పనిచేయడం, ఆటలాడడం చెప్పులు లేకుండా బయట తిరగడం వంటివి చేయొద్దని తెలిపారు. పార్క్ చేసిన వాహనాల్లోకి పిల్లలు, పెంపుడు జంతువులు వెళ్లకుండా చూడాలని సూచించారు.

మొత్తం1,148 పోలింగ్ స్టేషన్లు : కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం యంత్రాల మొదటిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ల మొదటి దశ రాండమైజేషన్ నిర్వహించారు. జిల్లాలో మొత్తం1,148 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. మొదటి రాండమైజేషన్ పూర్తి అయిన బ్యాలెట్ యూనిట్‌లు 2,210, కంట్రోల్ యూనిట్‌లు 1,637, వీవీప్యాట్‌లు 1,734 లను కేటాయించడం జరిగిందని, జాబితాను పార్టీ ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం అవరణలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూం, పోలీస్ బందోబస్తును కలెక్టర్ పరిశీలించారు. అక్కడున్న సిబ్బందికి సూచనలు చేశారు.రిజిస్టర్లను తనిఖీ చేసి రిజిస్టర్‌లో సంతకాలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి



ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో వాల్‌రైటింగ్

కోడ్.. గీడ్ జాన్తానై!

ఎక్కడి గోడరాతలక్కడే ▸ ఎటు చూసినా పోస్టర్లు, ఫ్లెక్సీలే దర్శనం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 3: లోక్‌సభఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రోజులు గడుస్తున్నా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో మాత్రం ఎక్కడ చూసినా గోడలపై రాతలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే పార్టీలకు చెందిన ప్రచార రాతలు(వాల్ పెయింటిగ్స్) పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించాలి. కానీ జంట మున్సిపాలిటీల పరిధిలో మాత్రం అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఉన్నతాధికారులు పర్యటించే హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారికిరువైపులా ఎక్కడ చూసినా గోడలపై రాతలు, పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు.



జోడిమెట్ల వద్ద గోడరాతలు, పోస్టర్లు



ఘట్‌కేసర్ బైపాస్‌లో ఫ్లెక్సీ

కనుల పండువగా పాంబండ జాతర

కులకచర్ల, ఏప్రిల్ 3: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర కనుల పండువగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి కోనేరులో స్నానాలు చేసి స్వామివారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చు కుంటు న్నారు. ఉగాది సమీపిస్తున్న కొద్ది భక్తుల తాకిడి పెరుగుతోంది. గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం, సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వరుడిని మండపానికి తీసుకెళ్తున్న అర్చకులు

ప్రారంభమైన వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కొడంగల్ : పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 9రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. మొదటి రోజు అర్చకులు మేదినిపూజ, అంకుర్పాణ దేవతా ఆరాధన, బీజావాపనం, అఖండదీపారాధన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి బస్టాండ్ సమీపంలో గల పారువేట మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు.

విశ్వాస ఘాతకులకు గుణపాఠం నేర్పాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల తారక రామారావు

వికారాబాద్, ఏప్రిల్ 3 : తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా వ్యవహరించి ఇతర పార్టీల్లోకి వెళ్లిన అవకాశవాదులకు, విశ్వాసఘాతకులకు లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం నేర్పాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్‌లోని నర్సింగ్ గౌలీకార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్నారు. రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలను బీఆర్ఎస్ నుంచి ఎంపీలుగా గెలిపిస్తే పార్టీలు మారి విశ్వాసఘాతుకానికి పాల్పడ్డారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి పార్టీకి ద్రోహం చేశారన్నారు. వికారాబాద్‌లో మెతుకు ఆనంద్‌ను, తాండూరులో రోహిత్‌రెడ్డిని ఓడించేందుకు పని చేశారన్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ, తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి తనను ఎంపీగా ఆశీర్వదిస్తే పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ ఎమ్మెల్యేలు, మెతుకు ఆనంద్, మహేష్‌రెడ్డి, బీఆర్ ఎస్ రాష్ట్ర నేత కార్తీక్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ బైండ్ల విజయకుమార్, టీఎస్‌డబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, పార్టీ నాయకులు చంద్రకళ, సుజాత, మధుకర్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, విజయకుమార్, దేవదాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు: ఎమ్మెల్యే యాదయ్య

తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్పష్టం చేశారు. పార్టీ మారిన వారికే అక్కడ గౌరవం లేదన్నారు. పార్టీ మారిన కేశవరావు, కడియం శ్రీహరి అనుచరులే పార్టీ మారవద్దని మాకు చెబుతున్నారని యాదయ్య కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు.పార్టీ కార్యకర్తలను, ఉద్యమకారులను దూరం చేసుకోవద్దని కాలే యాదయ్య వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు సూచించారు. ఉద్యమకారులను, పార్టీ కోసం పనిచేసే నాయకులను దూరం చేసుకోవడం వల్లనే ఈ పరిస్థితి ఎదురైందని ఆయన గుర్తు చేశారు.

మరో వివాదంలో మాజీ మంత్రి మల్లారెడ్డి

హరితహారం మొక్కలు నరికేసి కాలేజీ భవనాల నిర్మాణం

» తప్పుడు ఆరోపణలు చేసిన మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా » మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్



హరితహారం మొక్కల స్థానంలో నిర్మించిన కళాశాల భవనం

మేడ్చల్ ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మరో వివాదంలో నిలిచారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారాన్ని అపహాస్యం చేయడమే కాకుండా నాటిన వేల మొక్కలను తొలగించి కాలేజీ భవనాలు నిర్మించాడని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ ఈశ్వర్, గ్రామస్తులు గడిల కృష్ణారెడ్డి, ముద్రగణం సంపత్, గోపాల్,సాయికుమార్ తదితరులు బుధవారం కాలేజీ ఆవరణలో నాటిన మొక్కలను తొలగించి నిర్మించిన కాలేజీ భవనాలను మీడియా ప్రతినిధులకు చూపించిన అనంతరం మాట్లాడారు. 2016-18లో మూడేళ్ల పాటు ఉమెన్స్ కాలేజీ ఆవరణలోని మైదానంలో అప్పటి మంత్రి కేటీఆర్, కలెక్టర్, సీఎంవో అధికారి ప్రియాంకవర్గీస్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టి దాదాపు 10 వేల మంది విద్యార్థినులతో 32వేల మొక్కలు నాటించినట్లు తెలిపారు. తదనంతరం నాటిన మొక్కలను తొలగించి అదే స్థలంలో పెద్దపెద్ద కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. హరితహారం మొక్కలపై అప్పటి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని వేల మొక్కలను తొలగించిన మల్లారెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని వారు ప్రశ్నించారు. అంతేకాకుండా అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున కాలేజీ భవనాలను నిర్మించారని వారు ఆరోపించారు. మల్లారెడ్డి సంస్థలపై, భూఆక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు స్పష్టం చేశారు. చెరువులు, కుంటల సమీపంలో భూములు కొనుగోలు చేస్తూ క్రమక్రమంగా వాటిని ఆక్రమించే వారని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.



మాట్లాడుతున్న ఈశ్వర్

రూ. 20 కోట్ల పరువునష్టం దావా..

కాగా తనపై తప్పుడు ఆరోపణలు చేసిన మాజీ మంత్రి మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా వేయనున్నట్లు మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ తెలిపారు. తనకు డబ్బులు ఇచ్చినట్లు మాజీ మంత్రి మల్లారెడ్డి చేస్తున్న దుష్ప్రచారంలో ఎలాంటి నిజం లేదన్నారు. దమ్ముంటే మల్లారెడ్డి తనకు డబ్బులు ఇచ్చినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తూ తన ప్రతిష్టకు భంగం కల్గించేలా ఆరోపణలు చేసిన మల్లారెడ్డిపై రూ.20 కోట్ల పరువునష్టం దావా వేయనున్నట్లు ఆయన తెలిపారు.



ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రేగడిఘనపూర్ మాజీసర్పంచ్‌లు

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

చేవెళ్ల, ఏప్రిల్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాల అభివృద్ధికి పెద్ద పీటవేస్తున్నామని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, నర్సింలు, మాజీ ఉపసర్పంచ్‌లు బాల్‌రెడ్డి, యాదయ్య కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన బీంభరత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రంజిత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ రేగడిఘనాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం కోసం, రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రఘురాంరెడ్డి

ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 3 : ధైర్యానికి, ధీరత్వానికి మారు పేరు ఛత్రపతి శివాజీ అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి ధర్మ పరిరక్షణకు పాటుపడాలని చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్. రంగరాజన్ అన్నారు. ఆయన హిందూ ధర్మాన్ని చాటిన మహనీయుడని కొనియాడారు. బుధవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని చిలుకూరు దేవాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం రంగరాజన్ మాట్లాడుతూ శివాజీ మరాఠా యోధుడు అని, భారతీయులకు స్ఫూర్తిప్రదాత అని చెప్పారు. ఆయన అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడిచి హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని సీఎస్. రంగరాజన్ కోరారు. కార్యక్రమంలో పవన్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాశీంబౌలి గ్రామంలో ఛత్రపతి విగ్రహానికి మాజీ ఉపసర్పంచ్ రఘురాంరెడ్డి గ్రామస్థులతో కలిసి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

కొనసాగుతున్న నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 3 : మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో శ్రీ గణపతి, ఈశ్వర, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవాలు రెండోరోజు అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం ఫల, పుష్ప, ధాన్య శయ్యాధివాసం, హోమాన్ని మంత్రోచ్ఛరణల మధ్య వేదపండితుల నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ స్వర్ణలతసతీష్, గ్రామస్థులు సంజీవరెడ్డి, ఆర్. మహేందర్‌రెడ్డి, నర్సింహులు, విష్ణువర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న గ్రామస్థులు

విహారయాత్రకు
ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్లు

» 'అవిశ్వాసం' ఫిర్యాదుతో చైర్‌పర్సన్ అప్రమత్తం



ఘట్‌కేసర్, ఏప్రిల్ 3 : ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్‌పై పెట్టిన అవిశ్వాసం కొత్త మలుపు తిరిగింది. మున్సిపాలిటీలో మొత్తం 18 మంది కౌన్సిలర్లున్నారు. ఇందులో బీఆర్ఎస్ 11 మంది (చైర్ పర్సన్‌తో కలిపి) కాంగ్రెస్ 6, స్వతంత్రుడు ఒకరు. ఇందులో బీఆర్ఎస్ 10, ఇద్దరు కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు మొత్తం 12 మంది కలిసి ఇటీవల చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అవిశ్వాసానికి 13మంది కౌన్సిలర్లు అవసరం కాగా, ఉన్న 12మందికి తోడు ఒకరిని కలుపుకునే ప్రయత్నంలో ఉండగానే.. ఉన్నట్టుండి చైర్‌పర్సన్ 7మంది సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు, చైర్ పర్సన్‌తో కలిసి మొత్తం ఏడుగురు మంగళవారం సాయంత్రం టూర్‌కు వెళ్లారు. అవిశ్వాసంపై అధికారులు తేదీ ఖరారు చేయనప్పటికీ.. ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. ఎలాగైనా చైర్‌పర్సన్ పదవి నుంచి దించేయాలని సొంత పార్టీవారే ఇతర పార్టీ వారితో కలిసి చేసిన ప్రయత్నం నీరుగారి పోవడంతో ఏం చేయాలో తెలియక బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు లబోదిబోమంటున్నారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా అవిశ్వాసం ఎత్తును చిత్తు చేస్తూ చైర్‌పర్సన్ పావని తీసుకున్న నిర్ణయంతో బీఆర్ఎస్‌లోని మెజార్టీ కౌన్సిలర్లు సొంత పార్టీ కౌన్సిలర్లను కాపాడుకోవడంలో విఫలయ్యారని జోరుగా చర్చ జరుగుతోంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పలు దేవాలయాలను దర్శించుకొని బుధవారం రాత్రి బెంగుళూరుకు చేరుకున్నట్లు సమాచారం. పదవిని కాపాడుకునే ప్రయత్నంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. చైర్ పర్సన్ పావని యాదవ్ తనకు అవసరమైన బలంతో అజ్ఞాతంలోకి వెళ్లడంతో చేసేదేమీ లేక బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. చైర్ పర్సన్ పావని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అయినందున అవిశ్వాసం పెడితే పార్టీకి చెడ్డపేరు వస్తుందని కేటీఆర్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి సూచించినట్లు వివరించారు. పార్టీ అధిష్ఠానం సూచన మేరకు అవిశ్వాసాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. ఇదిలాఉంటే, ఈ ప్రకటనపై సోషల్‌మీడియాలో చైర్‌పర్సన్ ఎత్తుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చిత్తయ్యి చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని కామెంట్లు చేశారు. ఇంతప్రేమ ఉంటే.. అవిశ్వాసం కోరుతూ ఫిర్యాదు ఎందుకు చేశారు? అనే కామెంట్లూ వినిపిస్తున్నాయి. అవిశ్వాసాన్ని చిత్తు చేసేందుకు వెళ్లిన చైర్‌పర్సన్ వర్గం తేదీ ప్రకటించేవరకు బయటే ఉంటారా! లేక వచ్చి ఓటింగ్‌కు దూరంగా ఉంటారా అనేది వేచి చూడాల్సిందే.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో మంటలు

» సీజ్ చేసిన వాహనాల వద్ద అంటుకున్న చెత్త

» మంటలార్పిన పోలీసులు, ఫైర్ సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3 : ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో పాత వాహనాలను పార్కు చేసిన ప్రదేశంలో బుధవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే మంటలను ఆర్పడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. పోలీసుస్టేషన్ వెనకాల సీజ్ చేసిన వాహనాలతో పాటు ఇతర సామగ్రి స్టోర్ చేశారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో చెత్తకు మంటలు అంటుకున్నాయి. దాంతో గతంలో ఎప్పుడో సీజ్ చేసిన పటాకులపై నిప్పురవ్వలు పడటంతో మంటలు చెలరేగి భారీ శబ్దాలతో వచ్చాయి. పోలీసులు వెంటనే మంటలార్పే యత్నం చేశారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. చెత్తకుప్పపై నిప్పురవ్వలు పడి పక్కనే ఉన్న పటాకులపై పడటంతో మంటలు చెలరేగి, భారీ శబ్దం వచ్చిందని పోలీసులు తెలిపారు. సీజ్ చేసిన వాహనాలకు స్వల్పంగా మంటలు తాకినట్లు చెప్పారు. ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తెచ్చామని, ఎలాంటి ఆస్తినష్టం సంభవించలేదని తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా సిగరెట్ తాగి పడేయడం వల్ల మంటలు చెలరేగాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

» చెంగోల్ వేంకటేశ్వరాలయంలో నేటితో ముగియనున్న జాతర

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : మండల పరిధిలోని చెంగోల్‌లో శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం నూతన విగ్రహాలకు అభిషేకం, నిత్య పూర్ణాహుతి, మంగళశాసనము, చతుస్థాన అర్చన, మూలమంత్రహరణం, శయ్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఇంద్రసేనారెడ్డి, ఉమాదేవి, కృష్ణయ్య, వడ్డె విజయలక్ష్మి, బావనోళ్ల పద్మమ్మ, నర్సింహులు, నీలమ్మ, హన్మయ్య, రాజేశ్వరి, సురేష్‌కుమార్ దంపతులు హోమంలో కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు కిషోర్‌పంతులు ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. నేడు(గురువారం) శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పులేందర్, వెంకటేశం, రాము, శేఖర్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడి, జయంత్, పండరయ్య, రాకేష్‌గౌడ్‌తోపాటు కమిటటీ సభ్యులు, వివేకానంద, ఛత్రపతి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దంపతులు



తాండూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రైలెక్కిన 'కొండా'

» ప్రయాణికులతో కబుర్లు.. సమస్యలపై ఆరా

» సామాన్య ప్రయాణికుడిలా జనరల్ బోగీలో ప్రయాణం

తాండూరు, ఏప్రిల్ 3: తాండూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రజా ఆశీర్వాద యాత్రలో ఒకరోజు విరామం తీసుకున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి మంగళవారం హైదరాబాద్ పయనమయ్యారు. గతుకుల రోడ్లతో విసిగిపోయిన కొండా.. సామాన్య ప్రయాణికుడిగా రైలు జనరల్ బోగిలో వెళ్లారు. ఈ సందర్భంగా తాండూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ చేపట్టిన పనులకు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ క్లాస్ ఏసీ బోగిలో ప్రయాణించేందుకు సకల సౌకర్యాలు ఉన్నా కూడా.. సామాన్య వ్యక్తిలా ప్రయాణికులతో కలిసిపోయారు. బోగీలో ఉన్నవారిని పలకరించి.. సమస్యలు అడిగి తెలుసుకుంటూ రైలులో ప్రయాణించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ అభ్యర్థి రవియాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్లో ప్రయాణికులతో ముచ్చటిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

» స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 3 : వేసవి నేపథ్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల ప్రతీఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ముస్లింలు ఉపవాస దీక్షలో ఉండటంతో బయట ఎక్కువగా తిరిగే ప్రయత్నం చేయరాదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్‌లోని మధు కాలనీకి సంబంధించిన మదర్సా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కిషన్ నాయక్, సుధాకర్ రెడ్డి, వహీద్ మియా, మహిపాల్ రెడ్డి, రమేష్, మౌలానా అలిముద్దీయిన్, కరీం, సర్ఫరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘుపతి రెడ్డి, వెంకట్‌రెడ్డి, పారశురాం నాయక్, అసిఫ్, ఉస్మాన్, మాక్బూల్, విజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శంషాబాద్ విమానాశ్రయంలో
మార్చిలో 27 కస్టమ్స్ కేసులు

శంషాబాద్, ఏప్రిల్ 3: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 2024 మార్చిలో 27 కస్టమ్స్ కేసులు నమోదు చేశామని ఆ శాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ దేశాల నుంచి శంషాబాద్‌కు వచ్చిన ప్రయాణికుల వద్ద అక్రమంగా తెచ్చిన 12కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.



తాండూరు : మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి

» పీవో, ఏపీవోలకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచన

కొడంగల్, ఏప్రిల్ 3: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీవో, ఏపీవోలు ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఈమేరకు బుధవారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, కొడంగల్ మండలాలకు చెందిన పీవో, ఏపీవోలకు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వచ్చే ఓటర్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన పలు సలహాలు, సూచనలు చేశారు. తహసీల్దార్లు బి.విజయ్‌కుమార్, సి.విజయ్‌కుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు పారదర్శకంగా పని చేయాలి

తాండూరు : అధికారులు పారదర్శకంగా పని చేయాలని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించబోయే ప్రిసైడింగ్ అధికారులకు సహాయ ప్రిసిడింగ్ అధికారులకు ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని తాండూరు ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాలలో నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు పారదర్శకతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఏమైన సందేహాలు ఉంటే మాస్టర్ ట్రైనర్ల వద్ద నివృత్తి చేసుకోవాలని కోరారు. 300 పోలింగ్ సిబ్బందిగాను 257 మంది సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. హాజరుకాని వారు గురువారం శిక్షణకు హాజరుకాకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. తహసీల్దార్లు తారాసింగ్, కిషన్, వెంకటేష్, మునీరుద్దీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేపట్టాలి

» జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 3 : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రబీ వరి ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లింగ్యా నాయక్ మాట్లాడారు. 2023-24 యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అన్నివిధాలా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే 8 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణకు సంసిద్ధమవుతున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎవరైనా పొరపాటు చేసినట్లు మా దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 122 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కావలసిన సౌకర్యాలు తూకం మిషన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్స్, లైటింగ్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం యాసంగిలో వ్యవసాయ శాఖ అంచనా మేరకు లక్షా 93 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి రావొచ్చని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో కాకుండా, ఎత్తయిన ప్రదేశాల్లో వర్షపు నీరు నిలవకుండా, రవాణాకు సౌకర్యవంతంగా ఉండే స్థలాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని రైతుల సౌకర్యార్థం టెంట్లు, మంచి నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీఆర్డీవో శ్రీనివాస్, డీసీవో ఈశ్వరయ్య, డీఎంసీఎస్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డీటీలు, ట్రాన్స్‌పోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు పన్నులు సకాలంలో చెల్లించాలి

నార్సింగ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు పన్నులు సకాలంలో చెల్లించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాలకు సంయుక్తంగా 3,143 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించగా.. 3,067 కోట్లు సాధించామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. గత సంవత్సరం ఆదాయంతో పోలిస్తే 9.9 శాతం వృద్ధి రేటు సాధించామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా 1,689 కోట్లు, మేడ్చల్-మల్కాజ్‌గిరి 1,298 కోట్లు, వికారాబాద్ 80 కోట్లు కలిపి 3,067 కోట్లు ఆదాయం సాధించడం జరిగిందన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. 2024-2025లో సైతం ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఆర్టీవోలు రఘునందన్, సుభాష్‌చందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్



ఆకృతులను పరిశీలిస్తున్న ట్రస్మా జిల్లా కార్యదర్శి బస్వరాజ్

ఆకట్టుకున్న ఆర్ట్, క్రాఫ్ట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్

ధారూరు, ఏప్రిల్ 4 : ధారూరులోని శ్రీ చైతన్య పాఠశాలలో బుధవారం ఆర్ట్, క్రాఫ్ట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆకృతులను తయారుచేసి ప్రదర్శించారు. ట్రస్మా జిల్లా కార్యదర్శి బస్వరాజ్, సభ్యులు చంద్రశేఖర్, తిరుమలయ్య, యాదయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. కరస్పాండెంట్ మధు, డైరెక్టర్ రాజు, ప్రిన్సిపల్ అనిత, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా రఘువీరారెడ్డి



ధారూరు, ఏప్రిల్ 4: మండలానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డిని లోకసభ ఎన్నికల నేపథ్యంలో గద్వాల అసెంబ్లీ నియోజకవర్గానికి కోఆర్డినేటర్‌గా నియమిస్తూ బుధవారం టీపీసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. తనకు గద్వాల కోఆర్డినేటర్‌గా బాధ్యత అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ కార్యవర్గం బాధ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

యాలాల, ఏప్రిల్ 3: అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని యాలాల ఎంఈవో సుధాకర్‌రెడ్డి అన్నారు. యాలాల జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మంజు భాసినికి వీడ్కోలు సమావేశాన్ని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఎంఈవో మంజు భాసిని సన్మానించారు. పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, యాలాల మండల శాఖ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మొగులయ్య, సుధాకర్, జైపాల్‌రెడ్డి, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

5న మెగా రక్తదాన శిబిరం

పూడూరు, ఏప్రిల్ 3 : ఈనెల 5వ తేదీన మండలంలోని కంకల్ యూత్, ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గాంధీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు టి.రాజు సెల్‌నంబర్- 9985448178, బి.సురేష్-7981356625లలో సంప్రదించాలని తెలిపారు.

చేతి పంపునకు మరమ్మతులు

● తీరిన గని కార్మికుల నీటి కష్టాలు

బషీరాబాద్, ఏప్రిల్ 3: మండలంలోని జీవన్గి మార్గంలోని ఆంజనేయ దేవాలయం వద్ద చేతిపంపునకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. దాంతో కొంతకాలంగా గని కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. బోరు మరమ్మతును ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం దగ్గరుండి చేయించగా సాయిబాణ్ణ, మరికొందరు కార్మికులు సహకరించారు.

'ఉపాధి' కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 3: ఎండలు దంచి కొడుతున్నా ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని రైతు సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శి గంటి సురేశ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండ తీవ్రత చాలా అధికంగా ఉందని, ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయం అని అన్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎండ వేడిమి నుంచి సేదతీరేందుకు టెంట్లు సమకూర్చాలని అన్నారు. దినసరి కూలీ రూ.800లకు పెంచాలన్నారు.

కంకల్‌లో చలివేంద్రం ప్రారంభం

పూడూరు, ఏప్రిల్ 3 : మండలంలోని కంకల్‌లో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. నిజాంపేట్ మేడిపల్లి మాజీ సర్పంచ్ నర్సింహులు, బీజేపీ జిల్లా అధికారప్రతినిధి రవీందర్, రాంచందర్, మల్లేష్, విఠల్, రాజు, శివ, నిఖిల్, వంశీ, బుచ్చన్న, బాల్‌రాజ్, రాములు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి

యాలాల, ఏప్రిల్ 3: మండల మాజీ వైస్ ఎంపీపీ రామారావు బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. యాలాల మండలం జుంటుపల్లికి చెందిన రామారావు(46) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆయనను మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ రామారావు బుధవారం మృతిచెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రాం జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తాండూరురూరల్, ఏప్రిల్ 3 : ఈనెల 5న బాబూ జగ్జీవన్‌రాం జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ దళిత ప్రజాసంఘాల నాయకులు తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రమిచ్చారు. కౌన్సిలర్ శోభారాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయకులున్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

● నాయకులు, చిత్రపటాలు, విగ్రహాలకు నివాళి

వికారాబాద్, ఏప్రిల్ 3 : దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించే దిశగా అడుగులు వేయాలని మాజీ కౌన్సిలర్ బొండల శ్రీనివాస్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కొబ్బరికాయ కొట్టి నివాళులర్పించారు. కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి గోపాల్, సభ్యులు శివప్రసాద్, మహేష్, శంకర్, వెంకటేశ్, నర్సింహులు, ఇంజనీర్ నర్సిములు, మల్లేశం, బహుజన నాయకులు నవీన్ కుమార్, సీహెచ్ అంజయ్య తదితరుల్లున్నారు.

మేడ్చల్ టౌన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జయంతిని మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మున్సిపల్ 23వ, వార్డు కౌన్సిలర్ మహేష్ కురుమ



తాండూరు : కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కురుమ సంఘం ప్రతినిధులు



వికారాబాద్ : కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాండూరు : దొడ్డి కొమురయ్య 97వ జయంతి సందర్భంగా బుధవారం తాండూరు డివిజన్ కురుమ సంఘం అధ్యక్షులు నాగారం జగదీష్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాజ్‌గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కోసం పోరాటంచేసిన వీరుల త్యాగాలు దాచిపెట్టడం వల్ల.. ఇంకా ఎందరో జీవిత చరిత్రలు మనకు తెలియకుండా చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డ తర్వాత వీరుల పేర్లు తెరపైకి వచ్చాయని అన్నారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం మాట్లాడుతూ కొమురయ్యవంటి వీరుల త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శ్రీనివాస్, కురుమ సంఘం గౌరవాధ్యక్షులు గోపాల్, సంఘం ప్రతినిధులు గౌడి వెంకటేశం, రమేష్, పూజారి పాండు, తదితరులున్నారు.

కొడంగల్ రూరల్ : సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన అమరుడు దొడ్డి కొమురయ్య అని కురుమ సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శి కురువ నాగప్ప అన్నారు. కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన మహనీయుడన్నారు.



మేడ్చల్ టౌన్ : కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

బ్రిడ్జిపై నిలిచిన బస్సు.. ప్రయాణికుల అవస్థలు

● ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్ ● గంటసేపు రాకపోకలకు ఇబ్బంది



బ్రిడ్జిపై ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు, అంబులెన్స్

వికారాబాద్, ఏప్రిల్ 3 : ఓ ఆర్టీసీ బస్సు వికారాబాద్ బ్రిడ్జిపై ఒక్కసారిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంటపాటు బ్రిడ్జిపై రాకపోకలు నిలిచిపోయాయి. అదే సమయంలో తాండూరు నుంచి వెళ్లే ఓ అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడంతో పేషంట్‌ను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. పేషంట్ పరిస్థితి సీరియస్‌గా ఉందని.. దారి ఇవ్వాలని కోరినా ఏం చేయలేని దుస్థితి. ఓ హోంగార్డు ముందుగా అక్కడికి చేరుకుని వాహనాలను ముందుకు పంపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. క్రమ పద్ధతిలో వెళ్లాల్సిన ప్రయాణికులు సైతం ఓవర్ టేక్ చేసేందుకు చూడడంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది. బస్సు బ్రేక్ డౌన్ అవ్వడంతో గంటసేపు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందికి గురయ్యారు. కాలం చెల్లిన బస్సులతో తిప్పలు తప్పడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

విద్యార్థినికి అస్వస్థత

● జినుగుర్తి బాలికల సంక్షేమ పాఠశాల

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : బాలిక తండ్రి

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : తాండూరు మండల పరిధిలోని జినుగుర్తి తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, తన బిడ్డకు జరిగిన అన్యాయం ఏ బిడ్డకూ జరగరాదని బాలిక తండ్రి ఆసుపత్రి నుంచి వీడియో తీసి మీడియాకు చేరవేశాడు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రావుతండాకు చెందిన రాములు నాయక్‌కు ఇద్దరు ఆడపిల్లలు అమృత, లోకేశ్వరి. వీరిని తాండూరు మండలం జినుగుర్తి గేటు సమీపంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల పాఠశాలలో చదివిస్తున్నాడు. అమృత 9వ తరగతి, లోకేశ్వరి 7వ తరగతి అక్కడే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. గత నెల 26వ తేదీన అమృత ఆరోగ్యం బాగోలేదని వాంతులు, విరేచనాలు అవుతున్నట్లు హాస్టల్ నిర్వాహకులు తండ్రి రాములు నాయక్‌కు సమాచారం అందించారు. అప్పటికే అమృత తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది. రాములు అంబులెన్స్‌లో వికారాబాద్ మహావీర్ ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అమృత బాడీ ఇన్ఫెక్షన్‌కు గురైందని పరిస్థితి బాగోలేదని చెప్పారు. హైదరాబాద్‌కు తీసుకెళ్లే స్తోమత లేదని, ఇక్కడే వైద్యం అందించాలని రాములు వైద్యులను కోరాడు. ప్రస్తుతం అమృత కోలుకుంటోంది. వసతి గృహం నిర్వాహకులు, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తండ్రి రాములు వీడియోలో పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ పార్వతమ్మను వివరణ కోరగా, విద్యార్థిని అమృత అస్వస్థకు గురైంది వాస్తవమేనని తెలిపారు. అమృత పరిశుభ్రతను పాటించదని, అందుకే అస్వస్థతకు గురై ఉండవచ్చని పేర్కొన్నారు. తనకు వాంతులు, విరేచనాలు అవుతున్న విషయాన్ని కూడా చెప్పలేదన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : ఎంపీడీవో



కార్యదర్శులతో మాట్లాడుతున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని గుర్తు చేశారు. ప్రతిరోజు గ్రామాలకు వెళ్లాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఎంపీవో రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఘనంగా నాగమ్మ, బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

ధారూరు, ఏప్రిల్ 4: మండల పరిధిలోని హరిదాసుపల్లి గ్రామంలో బుధవారం వీర నాగమ్మ, బీరప్ప దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ధాన్యధివాసం, జలాధివాసం, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజారి కుమారస్వామి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న భక్తులు

రైతుల ధర్నాపై బీజేపీ అక్కసు

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్

వికారాబాద్, ఏప్రిల్ 3 : ఢిల్లీలో రైతులు న్యాయంగా చేస్తున్న ధర్నా, నిరసనలను బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని, రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగించి, తుపాకులతో బెదిరిస్తూ జలియన్ వాలాబాగ్ ఉదంతాన్ని తలపించేలా చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా తాండూరు పాత రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లో ధర్నా చేస్తున్న సమయంలో పోలీసులు దాష్టీకానికి రైతు మరణించారని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయలక్ష్మి పండిట్

హరితహారం మొక్కలు.. అగ్నికి ఆహుతి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 3 : లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నాటి, పెంచిన హరితహారం మొక్కలు అధికారుల ఉదాసీనతతో అగ్నికి ఆహుతవుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు చోట్ల రోడ్ల పక్కన చెత్తను తొలగిస్తున్న సిబ్బంది యథేచ్ఛగా చెత్తను తగుల బెడుతున్నారు. దాంతో ఎండలకు గడ్డి ఎండిపోయి ఉండటంతోపాటు చెత్తాచెదారం తోడవటంతో మంటలకు హరితహారం మొక్కలు దగ్ధమవుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో తరచూ మున్సిపల్ సిబ్బంది బాహాటంగానే చెత్తను కాలుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని మాధవరెడ్డి రైల్వే వంతెన నుంచి కొండాపూర్ రోడ్డులో సిబ్బంది చెత్తను కాల్చివేయడంతో చెట్లు కాలిపోతున్నాయని మందలించినప్పటికీ పట్టించుకోలేదు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ సాబేర్‌అలీని వివరణ కోరగా మాధవరెడ్డి రైల్వే వంతెన కింది నుంచి వెళ్లే రోడ్డుకిరువైపులా చెట్లు పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో చెత్తను తొలగించి రోడ్డుపైకి వచ్చిన కొమ్మలను తొలగించాలని ఆదేశించామని చెప్పారు. మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.



మాధవరెడ్డి వంతెన పక్కన చెత్తను తగులబెట్టిన మున్సిపల్ సిబ్బంది

పన్ను చెల్లింపులపై 5శాతం రాయితీ

కీసర రూరల్, ఏప్రిల్ 3 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను ముందస్తుగా.. ఈ నెల 30లోగా చెల్లించిన వారికి 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్యలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్లో, మున్సిపల్ కార్యాలయం వద్ద పన్నులు చెల్లించి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీలు, బ్యాంకు ఖాతాల ఓపెనింగ్



కమిటీలు వేస్తున్న ఎంఈవో హరిశ్చందర్

పరిగి, ఏప్రిల్ 3: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పరిగి ఎంఈవో హరిశ్చందర్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, బ్యాంకు అకౌంట్స్ ఓపెనింగ్‌పై హెచ్‌ఎంలు, మెప్మా అధికారులతో బుధవారం పరిగిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలకు సంబంధించి పత్రాలు తయారు చేసుకొని బ్యాంకుల్లో సమర్పించాలని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్‌గా గ్రామ సంఘం అధ్యక్షురాలు, కన్వీనర్‌గా హెచ్‌ఎంలు ఉంటారని తెలిపారు. హెచ్‌ఎంలు ఎం.గోపాల్, బి.కృష్ణారెడ్డి, శంకర్, అంజయ్య, కిష్టయ్య, కనకచారి తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఎన్నిక

కులకచర్ల, ఏప్రిల్ 3: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఎంపికలను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఎంపికలు ఆర్భాటం లేకుండా నిర్వహించారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 65 ఉండగా.. బుధవారం 63 పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ఎంపిక నిర్వహించారు. గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కమిటీ చైర్మన్లుగా, పాఠశాల హెచ్‌ఎంను కన్వీనర్‌గా ఎంపిక చేశారు. కాగా, రెండు పాఠశాలల కమిటీలకు నేడు(గురువారం) ఎంపిక జరగనుంది.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

● జడ్పీ సీఈవో సుధీర్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 3: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. సర్పంచ్‌లు లేని లోటును కార్యదర్శులు తీర్చాలని సూచించారు. ఎంపీవో యాదగిరి, వ్యవసాయ శాఖ అధికారి జయశంకర్, ఏపీవో శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ బక్కయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బాలంపేట్ పాఠశాలకు మండల స్థాయి ఉత్తమ అవార్డు

దౌల్తాబాద్, ఏప్రిల్ 3: యూడబ్ల్యూహెచ్ సహకారంతో విద్యాశాఖ వికారాబాద్, శిక్షణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మండల స్థాయి ఉత్తమ పాఠశాలగా సీపీఎస్ బాలంపేట పాఠశాలకు బహుమతి అందించారు. 1, 2, 3 తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం అభ్యాసన పుస్తకాలు ఇవ్వడం జరిగిందని, ఈ అభ్యాస పుస్తకాల ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ధారూరు, ఏప్రిల్ 3: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని హరిదాసుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టేపల్లి సుదర్శన్(50) గ్రామంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ విషయంలో మరో వ్యక్తితో సుదర్శన్‌కు నెల రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పంచాయతీ అధికారులకు అందిన ఫిర్యాదు ఆధారంగా సుదర్శన్ ఇంటి నిర్మాణంపై విచారణ జరిపి రోడ్డును ఆక్రమించి పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు నిర్ధారించారు. అక్రమ నిర్మాణాన్ని మంగళవారం అధికారులు తొలగించారు. దాంతో మనస్తాపానికి గురైన సుదర్శన్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా, గ్రామానికి చెందిన రాజేందర్ రెడ్డి తమ ఇంటి నిర్మాణాన్ని అధికారులతో కూల్చివేయించాడని మృతుడి కుటుంబికులు ఆరోపించారు. సుదర్శన్ ఆత్మహత్యకు కారణమైన రాజేందర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు. అదేవిధంగా ఇంటి నిర్మాణం కూల్చినందుకు మనస్తాపంతో సుదర్శన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అయన మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండు చేశారు. బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

బైక్‌ను ఢీన్న కారు.. ఒకరు మృతి

పూడూరు, ఏప్రిల్ 3 : బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన పూడూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జోగు పాండు(34) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం లక్ష్మి అనే మహిళను మన్నెగూడలో వదిలిపెట్టేందుకు బైక్‌పై వెళుతున్నాడు. ఈక్రమంలో మార్గమధ్యలో చీలాపూర్ గేటు వద్ద అతివేగంగా వస్తున్న కారు (ఎక్స్‌యూవీ400) బైక్‌ను ఢీకొట్టింది. దాంతో పాండు, లక్ష్మి తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు పరిగి ఆసుపత్రికి తరలించారు. కాగా, అప్పటికే పాండు మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3 : ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ రైల్వే పోలీసుస్టేషన్ పరిధి ఎల్‌సీ నెంబర్ 15 వద్ద సాయంత్రం 5 గంటల సమయంలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని గుర్తుతెలియని వ్యక్తి(35) పట్టాలు దాటుతుండగా ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు అతడిని ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం వద్ద పరిసరాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

బాలిక కిడ్నాప్ ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు

కులకచర్ల, ఏప్రిల్ 3: బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరిపై పోక్సో చట్టం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కులకచర్ల పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మార్చి 29న పరీక్షకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కటుంబ సభ్యులు ఆచూకీ కోసం తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మార్చి 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు బాలిక కిడ్నాప్‌కు గురైనట్లు గుర్తించి, మండలంలోని సాల్విడ్ గ్రామానికి చెందిన గోపాల్, అతనికి సహకరించిన పాలమూర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన రామకృష్ణను అరెస్టు చేసి పోక్సో చట్టం కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. బాలికను వికారాబాద్ సఖి కేంద్రానికి తరలించినట్లు వారు తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడి రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3 : బాలికను ప్రేమించమని వెంటపడుతూ.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్, మైసమ్మగుట్ట కాలనీకి చెందిన శివ(24) కొంతకాలంగా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. రెండురోజుల నుంచి వేధించడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. అనంతరం వారి సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కీసర రూరల్, మార్చి 3 : కీసర పోలీస్ స్టేషన్ పరిధి మండల పరిధి కుందన్‌పల్లి చౌరస్తా వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహన్ని కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, 6 అడుగుల ఎత్తు, తెల్లటి చుక్కల చొక్కా, బూడిద రంగుప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు కీసర పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాల్సిందిగా సూచించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. రెండు ట్రాక్టర్లు సీజ్

తాండూరు రూరల్, ఏప్రిల్ 3 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి తాండూరు మండల పరిధిలోని గోనూరు వాగులో రెండు ట్రాక్టరలో ఇసుక తరస్తున్నట్లు విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు పటాకి రాజు, తుకారాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో రాత్రివేళ ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

బషీరాబాద్, ఏప్రిల్ 3 : అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను బషీరాబాద్ పోలీసులు బుధవారం సీజ్ చేశారు. మండలంలోని మైల్వార్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా అటవీ భూమిలో ఎక్స్‌కవేటర్‌తో మొరం తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నాడనే సమాచారం పోలీసులకు చేరింది. ఎస్సై రమేష్ ఆదేశానుసారం పోలీసు సిబ్బంది అక్కడికి వెళ్లగా ఎవరు కనిపించకపోవడంతో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఫారెస్ట్ స్ట్రైకింగ్ ఫోర్స్ కానిస్టేబుల్ వీరేశం మొరం తవ్వకాల వద్దకు వెళ్లి పరిస్థితిపై సమీక్షించి స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడా జరిగిన వాస్తవ పరిస్థితిపై ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యాంసుందర్‌కు సమాచారం చేరవేశారు. మొరం తవ్వకాలకు ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లు వెళ్లగా ఒకటి మాత్రమే పోలీసులు తీసుకెళ్లినట్లు స్థానికంగా చర్చనీయంశమైంది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జాగ్రత్తగా ఉండాలి

కులకచర్ల, ఏప్రిల్ 3: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు అధికం అవుతుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని.. ప్రతీ ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వాజీవుద్దీన్, వైద్యురాలు మాధురి తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎండలో పని చేసేవారు వడదెబ్బ బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, నీరు, పళ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని, ఉపాధిహామీ పథకం కూలీలకు ఆశా కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో పనిచేసే ప్రతీ ఆశా కార్యకర్త వద్ద 100 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచడం జరిగిందని, ప్రతీ ఆరోగ్య ఉపకేంద్రంలో 500 ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు. అదేవిధంగా అత్యవసరం అయితే తప్పా.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.